క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేత మృతికి సంతాపం



నారాయణప్పుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న సాయికుమార్

జి.సిగడాం: బాతువ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత ముల్లు నారాయణప్పుడు మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, బూరాడ వెంకటరమణ, డోల వెంకటరమణ అన్నారు. ఆదివారం నారాయణప్పుడు కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఆబోతుల జగన్నాథం, ఎంపీటీసీ సభ్యులు బూటు అప్పారావు, పల్లేటి సన్యాసిరావు, కింజరాపు జగన్‌మోహన్, ఆదినారాయణ, శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: గుజరాతిపేట సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ సనపల బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్, స్తంభాల నిర్వహణలో భాగంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కుశాలపురం, కేశవరావుపేట, కొత్తపేట, గుజరాతిపేట, వెంకటాపురం గ్రామాల్లో విద్యుత్ కోత ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల : ధర్మవరం పంచాయతీ రామజోగిపేట శ్రీరామమందిరం వద్ద పంచాయతీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ అల్లు కన్నబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పలు అభివృద్ధి పనులు చేపడుతోందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జల్లు లక్ష్మణరావు, కుప్పిలి సూర్యనారాయణ, రుప్ప కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన ప్రసాద్

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం రూరల్ మండలం బైరికి చెందిన వల్లూరు ప్రసాద్ గాయపడ్డారు. శ్రీముఖలింగం వైపు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆటో ఢీకొంది. గాయపడిన ప్రసాద్‌ను 108 సిబ్బంది శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మొక్కలతో మానవాళి మనుగడ



లైబ్రరీ వద్ద మొక్కలు నాటుతున్న శ్రీనివాసరావు

లావేరు: మానవాళి మనుగడకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని లావేరు శాఖ గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లైబ్రరీ వద్ద ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లంకలపల్లి అప్పన్న, గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గృహ సారథుల సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో సోమవారం ఎచ్చెర్ల మండల గృహ సారథుల సమావేశం నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో అల్లినగరం-1, అల్లినగరం-2(అరిణాం అక్కివలస), చిలకపాలెం, ఎచ్చెర్ల, ఎస్‌ఎం.పురం, కేశవరావుపేట, ఫరీద్‌పేట, ఇబ్రహీంబాద్, పూడివలస, తమ్మినాయుడుపేట, జరజాం, ఎస్ఎస్ఆర్‌పురం గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరుకావాలని కోరారు.

ప్రజాస్వామ్యంలో..

ప్రజలే అంతిమ నిర్ణేతలు

- పేదలను ధనవంతులతో సమానంగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి ధర్మాన ప్రసాదరావు వెల్లడి
- రూ.1.50 కోట్లతో కలెక్టరేట్–కొత్తపేట రోడ్డు ప్రారంభం



రోడ్డు, చిల్డ్రన్ పార్కును ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాజ్యాంగం కల్పించిన హక్కును దర్జాగా వాడుకుని ధనవంతుడితో సమానంగా, హాయిగా జీవించేందుకు పేదలకు తగిన అవకాశాలను కల్పించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో రూ.1.50 కోట్లతో కలెక్టరేట్ నుంచి కొత్తపేట వరకూ నిర్మించిన రోడ్డు, చల్లా నరసింహారావు చిల్డ్రన్ పార్కును ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలకు సంబంధించి చంద్రబాబు హామీ ఇచ్చి మోసగించారని గుర్తుచేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఎన్నికల హామీ ప్రకారం మూడు వాయిదాల్లో బ్యాంకు రుణాలు చెల్లిస్తామని చెప్పి నెరవేర్చారని గుర్తు చేశారు. ఎన్నికల హామీలను శతశాతం అమలు చేసి సంక్షేమ రాజ్య స్థాపకుడుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఈ ప్రభుత్వం బాగా పనిచేస్తుందా లేదా అనేది సామాన్యులే నిర్ణయిస్తారని, ధనవంతులు కాదన్నారు. ప్రజా స్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, మూడున్నరేళ్లలో ఎన్నడూ లేని విధంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతిపక్షాల విష ప్రచారాన్ని నమ్మవద్దన్నారు.

ఎన్నడూ లేనంత అభివృద్ధి..

900 బెడ్లతో రిమ్స్ ఆస్పత్రిని అభివృద్ధి చేశామని మంత్రి ధర్మాన తెలిపారు. రోగులకు కావాల్సిన అన్ని రకాల మందులు, అత్యాధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. అరసవల్లి, జ్యోతీరావు పూలే కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. పెద్దమార్కెట్‌లో రూ.1.20 కోట్లతో రహదారిని నిర్మించామని, వీధి దీపాలు, పారిశుద్ధ్య పనుల నిర్వహణలో ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చేశామన్నారు. కార్పొరేషన్‌ను పరిశుభ్రంగా ఉంచడంతో అవార్డులు సొంతం చేసుకోగలిగామన్నారు. దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న అవినీతిని కూకటివేళ్లతో తొలగించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. కరోనా వంటి కష్టకాలంలో అన్ని వర్గాలను ఆదుకున్నామన్నారు. లక్షలాది కుటుంబాలకు తొమ్మిది నెలలు ఉచితంగా రేషన్ పంపించిన ఘనత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కొత్తపేటకు తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టనున్నామని, శ్మశానానికి రోడ్డు వేస్తామని చెప్పారు. పెద్దగన్నగళ్లవానిపేట బీచ్‌ను అభివృద్ధి చేసి 40 అడుగులు రోడ్డు వేసి విశాఖ బీచ్ మాదిరిగా తీర్చిదిద్దాలన్నదే తన ఆకాంక్ష అని వెల్లోడించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. చిల్డ్రన్స్ పార్కుకు నర్సింహారావు పేరు పెట్టడం అభినందనీయమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసన సభ్యునిగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, మున్సిపల్ కమిషనర్‌గా, చైర్మన్‌గా విశేష సేవలందించారని కొనియాడారు. కలెక్టరేట్‌కు స్థలాన్ని సేకరించడంలో కీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. రోడ్డు పనుల పూర్తికి స్థానికంగా ఉన్న నాయకులతోపాటు చల్లా శ్రీను ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, అంబటి శ్రీనివాసరావు, చల్లా శ్రీను, రావాడ జోగి నాయుడు, గంజి వాసు, శిమ్మ రాజశేఖర్, ఎన్ని ధనుంజయరావు, ఎం.తాతబాబు, కోణార్క్ శ్రీను, పొన్నాడ రుషి, మండవల్లి రవి, సుగుణారెడ్డి, అంధవరపు ప్రసాద్, టి.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాఘపౌర్ణమి పూజలు



గుజరాతిపేటలోని రాజరాజేశ్వరీపీఠంలో అమ్మవారికి హారతి



గోవిందనగర్‌కాలనీలో రాజరాజేశ్వరీ అమ్మవారికి అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్/ఎచ్చెర్ల/ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లా కేంద్రంలోని గోవిందనగర్ కాలనీలో రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఆదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి శ్రీచక్ర పూజలు, సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. 400 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మొదలవలస ఉషారాణి, జగన్మోహన రావు, జి.రాంబాబు, గోవిందమ్మ, ఎం.శివానందు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గుజరాతిపేటలోని శ్రీరాజరాజేశ్వరీ లలితామహాత్రిపుర సుందరి దేవిపీఠంలో నిర్వాహకులు పెంట రామచంద్ర శేఖరశర్మ ఆధ్వర్యంలో శ్రీచక్ర నవావరణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎచ్చెర్ల మండలం కొంచాలకూర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో పీఠాధిపతి బాల భాస్కర శర్మ ఆధ్వర్యంలో 1001 మేరువులకు, మహా మేరువుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై కుంకుమార్చన పూజలు చేశారు. రాజాం పట్టణ వ్యాపారులు డబ్బీరు బలరామకృష్ణ, నల్లి ప్రకాశరావులు పేదలకు వస్త్రాలు, గొడుగులు వితరణగా అందించారు.



మహా మేరువుకు అఖండ హారతి ఇస్తున్న బాలభాస్కరశర్మ



మేరువుల వద్ద కుంకుమార్చన పూజలు

కరాటే పోటీల్లో సిక్కోలు క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ లక్ష్మణ్‌నాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళానికి చెందిన పలువురు క్రీడాకారులు పతకాలతో సత్తాచాటారు. విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 3 నుంచి 5 వరకు జరిగిన 6వ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బి.దుర్గానందన్, వీవీఎస్ఎస్ శ్రీరామ్ రుత్విక్ రజత పతకాలు, ఎస్.ఆదిత్యానాయుడు, పి.కేతాన్‌కుమార్, బి.విగ్నేష్‌లు కాంస్య పతకాలు సాధించారు. వీరితో పాటు కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడు స్కూల్ డైరెక్టర్ ముద్దాడ సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ ఉషాకిరణ్మయి ఆదివారం అభినందించారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'



శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న చిన్నారులు



ఎచ్చెర్ల: ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని బలగ గ్రంథాలయంలో ఆదివారం లైబ్రేరియన్ పి.ఉగ్రసేన్ ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన ఉంటుందని, పిల్లలంతా గ్రంథాలయం సందర్శించి నచ్చిన పుస్తకాన్ని చదివి విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని కోరారు. అనంతరం 18 మంది చిన్నారులు కథలు చెప్పారు. కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి జి.నీలమ్మ నీతికథలు, వేమన, సుమతీ శతకం పుస్తకాలను చిన్నారులతో చదివించారు.

ఎచ్చెర్ల: ధర్మవరం శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. కథల పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎ.వినతి, ఎస్.వి జయలక్ష్మి, కె.భవ్యశ్రీలకు బహుమతులు అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం.చంద్రశేఖరరావు, సహాయకులు బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నకొంగరాంలో బాలవికాస్



బహుమతులు అందజేస్తున్న సత్యసాయి సంస్థ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిన్నకొంగరాంలో ఆదివారం సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. నారాయణసేవ, బాల వికాస్, పర్తియాత్ర చేపట్టారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామంలో ఇటీవల నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంబ్రాయిడరీ, మగ్గం వర్కు శిక్షణలు పూర్తిచేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఎన్ని లింగరాజు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి అప్పలరాజు పరామర్శ



గోవిందరావును పరామర్శిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

రణస్థలం: రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అదనపు వ్యక్తిగత కార్యదర్శి శంబాన గోవిందరావు ఇటీవల కాలు శస్త్రచికిత్స చేయించుకున్నారు. రణస్థలం మండలం జె.ఆర్.పురంలో ఉంటున్న గోవిందరావును ఆదివారం మంత్రి అప్పలరాజు పరామర్శించారు. ఈయనతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, పలాస మున్సిపల్ చైర్మన్ బల్లా గిరిబాబు, పలాస సీహెచ్‌సీ కమిటీ చైర్మన్ డబ్బీరు భవానిశంకర్, మాజీ ఎంపీటీసీ మామిడి కృష్ణారావు, రణస్థలం మండల మత్స్యశాఖ నాయకులు మైలపల్లి కామరాజు, పార్టీ నాయకులు కరిమజ్జి భాస్కరరావు, రెడ్డి వాసు, మింది శ్రీనివాసరావు, మహంతి సత్యనారయణ, ఎస్.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు



విజేతలతో స్వామినాయుడు, తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం రూరల్: జిల్లా స్థాయి స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. గాయిత్రి కళాశాలలో జరిగిన ముగింపు, బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో గోమతేష్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో ఆర్ఆర్ఎస్ స్కేటింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలకు గుర్తింపు



ఎస్‌ఐ లక్ష్మణరావును సన్మానిస్తున్న జేసీఐ గ్రీన్‌సిటీ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: నిస్వార్థ సేవలను గుర్తించి అభినందించడం సంతోషకరమని ట్రాఫిక్ ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు అన్నారు. జేసీఐ శ్రీకాకుళం గ్రీన్ సిటీ అధ్యక్షుడు మణిశర్మ ఆధ్వర్యంలో సెల్యూట్ ద సైలెంట్ వర్కర్‌లో భాగంగా పోలీస్ విభాగానికి సంబంధించి ట్రాఫిక్ ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావుకు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో సెనేటర్ పాలిసెట్టి మధుబాబు, జేసీఐ గ్రీన్‌సిటీ సెక్రటరీ రాజేశ్వరి, గుడ్ల మల్లేశ్వరరావు, యోగేశ్వరరావు, చేయూత వెంకటలక్ష్మి, ఎల్.లక్ష్మణరావు, సాయిబాబా, సుబ్రహ్మణ్యశర్మ, అనురాగ, టెక్కేమ్ రాంగోపాల్, మణికంఠ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

లాడ్జిల్లో తనిఖీలు



ఐడీ కార్డును పరిశీలిస్తున్న టూటౌన్ ఎస్‌ఐ వెంకటేష్

శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా నగరంలోని లాడ్జీల్లో రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ వెంకటేష్ ఆదివారం తనిఖీలు చేపట్టారు. కష్టమర్ల రిజిస్టర్లను పరిశీలించి అనుమానితుల సమాచారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పట్టణంలో అపరిచిత వ్యక్తులు చొరబడ్డారన్న సమాచారం మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఒరిజినల్ చిరునామా గుర్తింపు కార్డులను తనిఖీ చేసి రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలి

జి.సిగడాం: జి.సిగడాం రైల్వేస్టేషన్‌లో ఇంటర్‌సిటీ, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ కల్పించాలని ఎస్.పి.ఆర్.పురం సర్పంచ్ కంది రమాదేవి, వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ గెడ్డకంచరాం, ఎందువ, ఎస్.భీమవరం, నడిమివలస, ఎస్.పి.ఆర్‌పురం, వెలగాడ, దేవరవలస, చంద్రయ్యపేట, చెట్టుపొదిలాం, జి.సిగడాం, వెంకయ్యపేట, జగన్నాథవలస, జాడ, గొబ్బూరు, నిద్దాం, అద్వానంపేట, పెనసాం, గంగన్నదొరపాలెం తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేస్తే సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లకు వినతిపత్రాలు అందించామని చెప్పారు.

విశిష్టమైనది మాఘస్నానం



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: మాఘమాసంలో నదులు, గెడ్డలు, చెరువుల్లో స్నానాలు చేయడం ఎంతో విశిష్టమైనదని వక్త డాక్టర్ బారువ కోమలరావు అన్నారు. ఆదివారం నగరంలోని ఉపనిషన్మందిరంలో మాఘస్నానంపై ఉపన్యసించారు. సూర్యుడు మకరరాశిలో ఉన్నప్పుడు చేసే స్నానాన్ని మాఘస్నానం అంటారని చెప్పారు. మాఘమాస మహత్యాన్ని వివరించారు. కార్యక్రమంలో పతంజలిశాస్త్రి, ఎం.శ్రీనివాసరావు, వెంకటరమణ, సరస్వతి, చాగంటి బాపయ్య పంతులు, పి.వి.ఎస్. ప్రసాద్, మందుల మోహనరావు, ఎంఏ భట్లు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ

శ్రీకాకుళం క్రైమ్ : 'నీ మీద మీ జీవితమే కాదు.. మీ కుటుంబ సభ్యుల జీవితాలు ఆధారపడి ఉంటాయి.. అందుకే ద్విచక్రవాహనం నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించి ప్రాణాలు రక్షించుకోవాలి..' అంటూ ట్రాఫిక్ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలోని తహసీల్దారు కార్యాలయం ఎదురుగా వాహనదారులకు పలు సూచనలు చేశారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావు

నిస్వార్థ సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్



నటుకుల మోహన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: నిస్వార్థమైన సేవలను అంకితభావంతో నిర్వహించే అంతర్జాతీయ సంస్థ లయన్స్ క్లబ్ అని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ నటుకుల మోహన్ అధ్యక్షతన క్లబ్ 316ఎ రీజనల్ కాన్ఫరెన్స్ జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ ఓబులేసు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థ లయన్స్ క్లబ్ అని, శ్రీకాకుళం సెంట్రల్ విభాగం సేవ కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. తొలుత జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు. ఉత్తమ సేవలు అందించిన వివిధ ప్రాంతాల లయన్స్ క్లబ్ బృందాలకు జ్ఞాపికలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జగన్మోహనరావు, వ్యాపారవేత్త అంధవరపు ప్రసాద్, విద్యావేత్తలు బరాటం లక్ష్మణరావు, సురంగి మోహన్‌రావు, బాదాన దేవభూషన్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హారికా ప్రసాద్, పొన్నాడ రవికుమార్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల విజేత ధర్మవరం



ట్రోఫీ అందుకుంటున్న ధర్మవరం వాలీబాల్ జట్టు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరంలోని అసిరితల్లి యువజన సంఘం 10వ వార్షికోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో ఆతిథ్య ధర్మవరం జట్టు విజేతగా నిలిచింది. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి 18 జట్లు పాల్గొనగా ఫైనల్ పోరులో బొంతలకోడూరు జట్టుపై ధర్మవరం విజయం సాధించింది. మండల పరిషత్ విప్ బగ్గు రాజారావు బహుమతులు అందజేశారు. అంతకుముందు ఈ పోటీలను జిల్లా నెహ్రూ యువ కేంద్ర అధికారి కె.వి.ఉజ్వల్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు కన్నబాబు, నాయకులు రుప్ప రమేష్, స్పందన సంస్థ అధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, అసిరితల్లి యువజన సంఘం అధ్యక్షుడు రుప్ప లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని ధర్మశాస్త ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు ఆదివారం క్విజ్ పోటీలు జరిగాయి. చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటాపోటీగా ప్రశ్నలకు జవాబులు చెప్పారు. ఈ సందర్భంగా విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ప్రతిఒక్కరూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. అనంతరం నందు అనే చిన్నారి నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో నిర్వాహకులు బి.ఎం.ఎస్.పట్నాయక్, నిక్కు హరి సత్యం, టెలికాం శ్రీనివాస్, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న చిన్నారి నందు నృత్య ప్రదర్శన